పేదలపై గుది 'బండ'

- పెరిగిన గ్యాస్ ధరలు
- వెల్లు వెత్తుతున్న నిరసనలు
- సిలిండర్‌కు రూ.50 పెంపు
- నియోజకవర్గ ప్రజలపై రూ.35 లక్షలకు పైగా అదనపు భారం



గ్యాస్ ధరలు తగ్గించాలని మహిళ సంఘాల నిరసన(ఫైల్)

కనిగిరిరూరల్:

వంట గ్యాస్ బండ బరువెక్కింది. పేద, మధ్య తరగతి కుటుంబాలపై ప్రభుత్వాలు మళ్లీ భారం వేశాయి. పెరిగిన గ్యాస్ ధరలు వినియోగదారుని నడ్డి విరుస్తున్నాయి. ఇప్పటికే అకాశాన్నంటుతున్న నిత్యవసర ధరలతో పాటు, విద్యుత్ చార్జీలు బెంబేలెత్తిస్తున్నాయి. మళ్లీ ఇప్పుడు పెరిగిన వంట గ్యాస్ ధరలతో ప్రజలు అల్లాడుతున్నారు. ఇప్పటికే అనేక చోట్ల ప్రజా సంఘాలు, వివిధ పార్టీలు, ప్రజలు పలు రూపాల్లో నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

రూ.35 లక్షల వడ్డన

ప్రతి గ్యాస్ సిలిండర్‌పై రూ.50 అదనపు భారం పడింది. 14.2 కిలోల సిలిండర్ ధరను రూ. 50 అదనంగా పెంచారు. నియోజకవర్గంలో సుమారు 70 వేలకు పైగా గ్యాస్ కనెక్షన్‌లు ఉన్నాయి. సాధారణంగా సరాసరిన 60 రోజులకు ఒక గ్యాస్ సిలిండర్‌ను వినియోగదారులు కొనుగోలు చేస్తారు. నియోజకవర్గ ప్రజలపై సుమారు రూ.35 లక్షల అదనపు భారం పడింది. నిన్నటి వరకు రూ.849 ఉన్న సిలిండర్ ధర తాజా పెంపుతో ఇప్పుడు రూ.899కి చేరింది. గృహ అవసరాల గ్యాస్ ధరలను పెంచడంతో మహిళలు ఆగ్రహంతో ఉన్నారు.

కూటమి ప్రభుత్వంలో ధరల మోత..

కూటమి ప్రభుత్వంలో ధరల మోత మోగిపోతుంది. అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలకు చెల్లుచీటి పెట్టిన ప్రభుత్వం.. వివిధ రకాల వస్తువుల ధరలను పెంచుతూ పేదలపై భారం మోపుతుంది. గత ఏడాదితో పోలిస్తే విద్యుత్ చార్జీలు రెట్టింపుగా వివిధ ట్యాక్స్‌ల పేరుతో వసూలు చేస్తున్నారు. నిత్యవసర ధరలు నింగినంటాయి. ధరలు అదుపు చేయాల్సిన ప్రభుత్వం చేతులెత్తేసింది. కందిపప్పు పంపిణీ మూన్నాళ్ల ముచ్చటగా మారింది. వంటనూనెలు కాగుతున్నాయి. మహిళలు నిత్యం వినియోగించే వంట గ్యాస్ ధరలను ఏకపక్షంగా పెంచడంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని ప్రజలు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

కొందరికే రాయితీ..

రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందించే పథకం కూడా కొందరికే వర్తిస్తోంది. ఈ పథకాన్ని గతేడాది నవంబర్‌లో ప్రారంభించింది. రాయితీ మాత్రం కొంత మంది వినియోగదారులకు మాత్రమే బ్యాంకుల్లో జమైంది. మిగతా వాటి పరిస్థితి ఏమిటనేది అర్థం కాని ప్రశ్న.

ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తోంది:



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇష్టానురీతిగా పెంచుతూ ప్రజలపై మోయ లేని భారం వేస్తున్నారు. గ్యాస్ ధర పెంచితే సిలిండర్ కొని వంట చేసుకుని పరిస్థితి లేదు. ప్రజలు ఒక్క పూట తిని పస్తులు ఉండే పరిస్థితి నెల కొంది. గ్యాస్ ధరలు పెంచుతూ ఉంటే మళ్లీ కట్టెల పొయ్యిలు తెచ్చుకుని వంట చేసుకునే పరిస్థితి. కూటమి ప్రభుత్వంలో వరసగా విద్యుత్, నిత్యవసర ధరలు, వంట నూనె, తాజాగా గ్యాస్ ధరలు పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారు. పెరిగిన ధరలను రాష్ట్ర ప్రభుత్వమే బరాయించాలి

జి.గాయత్రి, ఏపీ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి

దగా చేసిన కూటమి సర్కార్:



అధికారంలో వస్తే నిత్యవసర ధరలు పెంచమని, ప్రజా ఆమోద్యయోగ్యమైన పాలన చేస్తామని చెప్పిన కూటమి సర్కార్ రాష్ట్ర ప్రజలను మరోసారి దగా చేసింది. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన కూటమి నాయకులు.. అధికారంలోకి వచ్చాక ప్రజలను పూర్తిగా విస్మరించారు. నిత్యం మహిళలు ఇంట్లో ఉపయోగించుకునే వంట గ్యాస్ ధర పెంచడం సరికాదు.

కే ప్రసన్న(ఐద్వా మండల కార్యదర్శి, కనిగిరి)

ప్రభుత్వం మహిళలను మోసం చేస్తోంది:



ఎన్నికల్లో అనేక మహిళలు అనేక హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన కూటమి సర్కార్ మహిళలను నిలువునా మోసం చేస్తోంది. మహిళా సంక్షేమ పథకాలను ఇప్పటి వరకు అమలు చేయలేదు. 10 నెలల పాలనలో నిత్యవసర ధరలు విపరీతంగా పెరిగాయి. తాజాగా గ్యాస్ ధరలను సిలిండర్ బండకు రూ. 50 పెంచింది. కేంద్రం పెంచిన గ్యాస్ ధర భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే బరాయించాలి

మద్దిశెట్టి భారతి, హ్యూమెన్ రైట్స్ జిల్లా మహిళా అధ్యక్షురాలు

క్లుప్తంగా

వివాహ వేడుకల్లో దద్దాల


వివాహ వేడుకల్లో దద్దాల నారాయణ యాదవ్

కనిగిరిరూరల్: కొత్తూరులోని తమ్మినేని శ్రీనివాసులరెడ్డి, అల్లూరమ్మ కుమారుడు మోహన్ రెడ్డి వివాహ వేడుకల్లో వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ ఆదివారం రాత్రి పాల్గొని ఆశీర్వదించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, కౌన్సిలర్ తమ్మినేని సుజాతరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆవుల భాస్కర్‌రెడ్డి, వాకుమళ్ల రాజశేఖరరెడ్డి, రమణారెడ్డి, శ్రీహరి, శివారెడ్డి, ఆదిలక్ష్మమ్మ పాల్గొన్నారు.

భైరవకోనకు పోటెత్తిన భక్తులు


భైరవకోనలో పూజల్లో పాల్గొన్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక ప్రాంతం భైరవకోనకు భక్తులు ఆదివారం పోటెత్తారు. భక్తులు త్రిముఖ దుర్గాదేవి, భర్గులేశ్వర, కాలభైరవ, నగరేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పొంగళ్లు నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఈఓ డి.వంశీకృష్ణా, ముప్పాళ్ల శ్యామ్‌సుందర్‌రాజు ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు.

హాస్టల్‌ను తనిఖీ చేసిన మంత్రి


హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న మంత్రి స్వామి

కొండపి: స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్‌ను మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ రామయ్య చౌదరి, సీఐ సోమశేఖర్, ఎస్సై ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖాదర్‌బాష భౌతికకాయానికి నివాళి


ఖాదర్ బాష భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న నేతలు

కనిగిరిరూరల్: స్థానిక 18వ వార్డుకు చెందిన మైనార్టీ నాయకుడు ఎస్‌కే ఖాదర్‌బాష ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఖాదర్ బాష భౌతికకాయాన్ని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్‌గఫార్, వైస్ చైర్మన్, పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్‌ఎం బసిరెడ్డి పిచ్చిరెడ్డి, విజేత విద్యా సంస్థల అధినేత పసుపులేటి అరుణోదర్, మాజీ కౌన్సిలర్ సయ్యద్ నాయబ్ రసూల్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ తిరునాళ్ల మహోత్సవం


పూజలు అందుకుంటున్న పోలేరమ్మ తల్లి

వెలిగండ్ల,(కనిగిరిరూరల్): వెలిగండ్లలో పోలేరమ్మ తల్లి తిరునాళ్ల మహోత్సవం వైభవంగా జరిగింది. తిరునాళ్ల సందర్భంగా పోలేరమ్మ తల్లి గుడిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. శనివారం రాత్రి నుంచి అమ్మవారి తిరునాళ్ల ప్రారంభమైంది. ఆదివారం సాగుబడి కార్యక్రమం, రాత్రికి అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. సోమవారం పొంగళ్ల మహోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించండి

సింగరాయకొండ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను నియోజకవర్గంలో గ్రామ గ్రామాన నిర్వహించాలని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఉదయం 10 గంటలకు పార్టీ క్యాంపు కార్యాలయంలో, పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో జరిగే జయంతి వేడుకల్లో పాల్గొనున్నట్లు పేర్కొన్నారు.

గయాజ్‌కు పార్టీ నాయకుల పరామర్శ


గయాజ్‌ను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పామూరు: వైఎస్సార్ సీపీ మైనారిటీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్.గయాజ్ ఇటీవల అనారోగ్యానికి గురికాగా శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈసందర్భంగా ఆదివారం గయాజ్ నివాసానికి వెళ్లిన వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ షేక్.చాంద్ బాషా పలువురు గయాజ్‌ను పరామర్శించి ఆయన ఆరోగ్యంపై చర్చించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కో ఆప్షన్ షేక్.నాయబ్‌రసూల్, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, అంబటి కొండారెడ్డి, జొన్నలగడ్డ గోవిందయ్య, నియోజకవర్గ ఎస్టీసెల్ అధ్యక్షుడు శ్రీరాం శ్రీను, సోషల్‌మీడియా అధ్యక్షుడు మర్రి రాజు, తుపాకుల ఆంజనేయులు, ఎంపీటీ నాయబ్‌రసూల్, కోడూరి లక్ష్మీనారాయణరెడ్డి, షేక్.కాలేషా, మితికాల బాలక్రిష్ణ, షేక్.రసూల్, ఖాజామస్తాన్, షేక్.వసీమ్, షేక్.రియాజ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపూజ, మహానివేదన


మహానివేదన ప్రదక్షిణోత్సవంలో ఆలయ కమిటీ, భక్తులు


గోపూజలో ఆలయ కమిటీ, భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం అభిషేకోత్సవం, మహానివేదన, గోపూజ అర్చకులు మంకాల శివప్రసాద్ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపూజ నిర్వహించారు. ముందుగా నారాయణస్వామి మూలవిగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవమూర్తులకు అభిషేకం, ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం భజంత్రీల మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామికి నైవేద్యంగా సమర్పించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈఓ శ్రీగిరిరాజు నరసింహ బాబు, కొమ్మినేని వెంకట్రావు, ముడుమాల నారాయణరెడ్డి, పందిళ్ల ఎల్లయ్య, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక


ఆత్మీయ కలయికలో పూర్వపు విద్యార్థులు

వెలిగండ్ల,(కనిగిరిరూరల్): వెలిగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వపు విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. 25 ఏళ్ల తర్వాత 1999-2000 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులంతా ఒక్క చోటికి చేరారు. సుమారు 70 మంది విద్యార్థులు ఒకే చోట చేరడంతో సందడి నెలకొంది. అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ.. ఒకరినొకరు పలకరించుకుంటూ సంతోషంగా గడిపారు. వివిధ ఉద్యోగాల్లో, వృత్తుల్లో, వ్యాపారాల్లో ఇలా రక రకాల జీవన గమనంలో ఉన్న వారంతా కలిసి ఆత్మీయ పలకరింపు చేసుకుంటూ యోగ క్షేమాలు మాట్లాడుకుంటా ఎంతో ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన కృష్ణమూర్తి, రమేష్, వెంకటరెడ్డి, వెంకట్రామయ్య, శేషగిరిరావు, సుబ్రహ్మణ్యం మాస్టర్లను సన్మానించారు. హెచ్‌ఎం రాఘవచారి, ఉపాధ్యాయులు, పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా మంగమ్మ గరటయ్య స్వామి తిరునాళ్ల


మంగమ్మ గరటయ్య స్వామికి ప్రత్యేక అలంకరణ


వాలిచర్లలో పోలేరమ్మ తల్లికి కుంకమ బండి పొంగళ్లు


కొనసాగుతున్న ఎడ్లపందెలు


మంగమ్మ తల్లి ఆలయంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ

హనుమంతునిపాడు: మండల పరిధిలోని నందనవనం పంచాయతీ మంగమ్మపల్లిలో వెలసిన మంగమ్మ తల్లి గరటయ్య స్వామి తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య మంగమ్మ గరటయ్య స్వామికి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. పాపిరెడ్డిపల్లి, మంగమ్మపల్లి గ్రామస్తులు కుంకమ బండ్లను ఏర్పాటు చేసి అలయం చుట్టూ ప్రదక్షణలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఎడ్ల పోటీలు కొనసాగుతున్నాయి. ఈసందర్భంగా విద్యుత్ ప్రభ ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. సోమవారం ప్రత్యేక పొంగళ్లు, అన్నదానం ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. వాలిచర్లలో వైఎస్సార్ సీపీ నాయకులు పోలేరమ్మకు ప్రత్యేక పొంగళ్లుపెట్టారు. కుంకమ బండి ఏర్పాటు చేశారు. ప్రత్యేక పొంగళ్ల పోట్టి ఊరేగింపుగా వెళ్లి పోలేరమ్మ తల్లి చుట్టూ ప్రదక్షణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా మట్టల ఆదివారం


పొన్నలూరులో ఈత మట్టలతో ర్యాలీ చేపట్టిన చిన్నారులు

పొన్నలూరు: పొన్నలూరులోని బాప్టిస్టు నగర్‌లో తెలుగుబాప్టిస్ట్ చర్చి సండే స్కూల్ చిన్నారుల ఆధ్వర్యంలో మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. రంగు రంగుల పూలతో అందంగా అలంకరించిన ఈత మట్టలను ప్రధాన రహదారుల్లో చిన్నారులు ప్రదర్శిస్తూ ఏసుక్రీస్తు గీతాలను ఆలపించారు. అనంతరం రెవరెండ్ పాస్టర్ చుండి ప్రభాకర్ గుడ్‌ఫ్రైడే పండుగకు సూచికగా నిర్వహించే మట్టల ఆదివారం విశిష్టిత గురించి వివరించారు.

టంగుటూరు: మండలంలో మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక నూతన ఎరుషలేము క్రైస్తవ న్యూ లైఫ్ ప్రార్థనా మందిరం, క్రీస్తు సంఘం పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సండే స్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలి


అవగాహన ర్యాలీచేస్తున్న జేవీవీ నాయకులు

పామూరు: మూఢ నమ్మకాలకు ప్రజలు దూరంగా ఉండాలని జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ ఎం గేయానంద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జేవీవీ జిల్లాస్థాయి శిక్షణ తరగతులను జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ తిరివీధి చెన్నకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూఢ నమ్మకాలను పారదోలేందుకు జ్యోతిరావ్ పూలే, అంబేడ్కర్ వంటి మేధావులు చేసిన కృషి ఎనలేనిదన్నారు. మూఢనమ్మకాలపై కందుకూరి వీరేశలింగం కూడా ఎంతో కృషిచేశారన్నారు. జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ చెన్నక్రిష్ణ మాట్లాడుతూ జీవ వైవిధ్యం, పర్యావరణ పరిరక్షణకు, సైన్స్ ఉద్యమ నిర్మాణ విస్తృతికి, బలోపేతానికి కృషి చేయాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మండ్లా శ్రీనివాసులు, సీ.హెచ్.జయప్రకాష్ పాల్గొన్నారు.

విద్యార్థినికి ముస్లిం ఐక్యవేదిక సన్మానం

కందుకూరు: ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన పట్టణానికి చెందిన షేక్ రైజా అనే విద్యార్థిని ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఇంటర్ పూర్తి చేసిన రైజా మొన్న విడుదలైన ఇంటర్ సెకండ్ ఇయర్ ఫలితాల్లో 1000 మార్కులకు గాను 990 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్ సాధించింది. ఈ సందర్భంగా మైనార్టీ వర్గానికి చెందిన విద్యార్థిని మెరుగైన ఫలితాలు సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ విద్యార్థిని మిగిలిన విద్యార్థులకు ఆదర్శం కావాలని, విద్య, ఉద్యోగాల్లో మైనార్టీ విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ముస్లిం ఐక్యవేదిక నాయకులు షేక్ మహబూబ్‌బాషా, బేగ్, ఖాజీ సయీద్, ఉర్దూ డీఐ హబీబులా పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు కొనసాగించాలి


అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కందుకూరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉమ్మడి ప్రకాశం జిల్లా మాల ఉద్యోగులు, మాలమహానాడు స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించడమే కాకుండా, జాతి ఐక్యతకు, అసమానతల రూపకల్పనకు అంబేడ్కర్ ఎంతో కృషి చేశారని చెప్పారు. రాజ్యాంగంలో ప్రతి వర్గానికి హక్కులు కల్పించారని, సమసమాజ సమానత్వం కోసం పాటుపడ్డారని వివరించారు. అటువంటి మహనీయుని సేవలను గుర్తు చేసుకోవడం, నేటి తరానికి అంబేడ్కర్ గొప్పదనాన్ని తెలియజేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అంబేడ్కర్ ఆశయసాధన కోసం అన్ని వర్గాల ప్రజలు కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. నేడు అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాల ఉద్యోగుల సంఘం, మాల సంఘాల జేఏసీ అధ్యక్షుడు తుల్లిబిల్ల అశోక్, జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పాలేటి కోటేశ్వరరావు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కొప్పోలు ఏడుకొండలు, నాయులు వై మల్లికార్జున, జనార్దన్, బి గోపీనాథ్, పి వివేకానంద, కె బాబూరావు, థామస్, ఎం రవికుమార్, ఎం లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలుల బీభత్సం


రైల్వేస్టేషన్ రోడ్డులో ఈదురుగాలులతో దుమ్ములేగిన దృశ్యం


టంగుటూరులో ఈదురు గాలులతో కిందపడిన ఫ్లెక్సీలు


విప్పగుంటలో ఎగిరిపోయిన బ్యారన్ రేకులు


నేతివారిపాలెంలో ఈదురుగాలులకు ఎగిరిపోయిన రేకులు

సింగరాయకొండ: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉదయం ఎండ తీవ్రతతో వాతావరణం వేడెక్కగా సాయంత్రం 5 గంటల సమయంలో మేఘాలు ఉధృతంగా రావడంతో వాతావరణం చల్లబడి ఈదురుగాలులు మొదలయ్యాయి. దీంతో బజార్లన్నీ దుమ్ము ధూళితో నిండగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డుపక్కన దుకాణాలు దుమ్ముతో నిండిపోయాయి. ఈదురుగాలుల కారణంగా విద్యుత్ టవర్ వద్ద వైర్లు తెగటంతో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడిందని విద్యుత్ శాఖ ఏఈ సాంబశివరావు తెలిపారు. సుమారు 3 గంటల సేపు విద్యుత్ కు అంతరాయం ఏర్పడటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చిరుజల్లులు పడటంతో వాతావరణం చల్లబడింది.

కొండపి: మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలతో కూడిన వర్షం కురిసింది. సాయంత్రం వరకు ఉక్కపోతతో ప్రజలు అల్లాడగా 5 గంటల తరువాత ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో ఈదురుగాలుల వర్షం కురిసింది. కొన్నిచోట్ల ఈదురుగాలులకు రేకులు ఎగిరిపోయాయి. పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. ఈదురుగాలులకు కరెంటు సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. స్థానిక విష్ణాలయం వీధిలో సైడు కాలువలో లేక నీరు రోడ్డుపై నిలిచిపోయాయి.

టంగుటూరు: మండలంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు టంగుటూరులో దుకాణాలకు అడ్డంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు రోడ్డుపై పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పొగాకు, శనగ పంటలు దెబ్బతినకుండా వర్షంనీటిని తోటల్లో నిల్వ లేకుండా చూడాలని వ్యవసాయాధికారులు సూచనలు చేశారు.